క్లుప్తంగా

ఎంపీపీ సహకారంతో అన్నదానం


అన్నదానం చేస్తున్న భీమిలి ఎంపీపీ వాసురాజు

పద్మనాభం: మండలంలోని మద్ది శ్రీ ధర్మ శాస్తా అయ్యప్ప పీఠం వద్ద 22వ రోజైన మంగళవారం భీమునిపట్నం ఎంపీపీ దంతులూరి వాసురాజు ఆర్థిక సహాయంతో అయ్యప్పలు, భవానీ మాలధారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమునిపట్నం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గాడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మ ఆలయానికి స్టీల్ ప్లేట్ల అందజేత

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి మంగళవారం 50 స్టీల్‌ప్లేట్లు అందించారు. ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వీటిని స్వీకరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పీఎం పాలెం: తాడిగడప భారతి అనే మహిళ పీఎం పాలెం హౌసింగ్ బోర్డు కాలనీలో విశ్రాంత ద్యోగుల ఓల్డేజ్ హోమ్ నడుపుతోంది. ఈ నెల 11వ తేదీన స్థానిక శాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ రోడ్డులో వెళ్తుండగా రోడ్డు పక్కన పడి ఉన్న సుమారు 70 సంవత్సరాల వృద్ధుడిని గమనించింది. వెంటనే స్పందించి మానవత్వంతో గాయత్రీ ఆస్పత్రిలో చేర్పించింది. ఆ తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు. ఈ మేరకు కేసు నమదు చేసామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

ఎన్‌ఎస్‌డీ సర్వే విజయవంతం చేయాలి

పద్మనాభం: ఎన్‌ఎస్‌డీ సర్వే విజయవంతం చేయాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న అన్నారు. మంగళవారం ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలకు ఎన్‌ఎస్‌డీ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి జరగనున్న ఎన్‌ఎస్‌డీ సర్వేలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఇంటింటికీ వెళ్లి బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్, షుగర్, బీపీ వ్యాధులతో బాధ పడుతున్న వారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో శ్రీనివాసరావు, సూపర్ వైజర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

800 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో మంగళవారం ఆటోలో తరలిస్తుండగా 800 కిలోల పీడీఎస్ బియ్యాన్ని వీఆర్వో పల్లికల అప్పలరాజు కోళ్లఫారం సమీపంలో పట్టుకున్నారు. భోగాపురం మండలం రావాడ నుంచి ఆటోలో ఈ బియ్యాన్ని సాయంత్రం అనంతవరంలోని రైస్ మిల్లులకు తరలిస్తుండగా వీర్వో పట్టుకున్నారు. బియ్యాన్ని సీజ్ చేసి పద్మనాభం ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు అప్పగించగా, ఆటోను పోలీసులు సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్ తాడివలస అప్పలరాజుపై పద్మనాభం పోలీసులు కేసు నమోదు చేశారు.

శాస్త్రీయ దృక్పథంతోనే మతంపై అవగాహన

కొమ్మాది: మతం అంటే పూజలు, ఆచారాలు, మూఢ నమ్మకాలు కాదని, సనాతన ధర్మం అని, శాస్త్రీయ దృక్పథంతోనే మతాన్ని అవగాహన చేసుకోవాలని రామకృష్ణ మిషన్ స్వామీజీ విద్యానంద అన్నారు. గీతంలో జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో బాలల సైన్స్ కాంగ్రెస్ 2024 కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విజ్ఞానం, శాస్త్రం వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను ఆపలేదని, సనాతన ధర్మానికి శాంతిని నెలకొల్పే శక్తి ఉందని తెలిపారు.

చదువుల నెలవు.. సమస్యల కొలువు

- శిథిలమవుతున్న గ్రంథాలయం
- ఇబ్బంది పడుతున్న పాఠకులు


దెబ్బతిన్న గ్రంథాలయ భవనం

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయం శిథిలమవుతుండడంతో దీని నిర్వహణ ప్రశ్నార్థకం అవుతోంది. గతంలో అద్దె భవనంలో దీన్ని నిర్వహించేవారు. అయితే 2006లో బీచ్ సమీపంలో ప్రభుత్వం సొంత భవనం నిర్మించింది. అప్పటి నుంచి ఇందులో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. అయితే అవసరాలకు తగిన మేరకు కాకుండా చిన్న గదులతో దీని నిర్మాణం జరిగింది. దీంతో పుస్తకాలు భద్రపరచుకోవడం ఇబ్బందిగా ఉంది. దానికి తోడు పాఠకుల గదిలో పది మంది కూడా కూర్చునే అవకాశం లేకపోవడం పెద్ద సమస్యగా ఉంది. ఇదిలా ఉండగా గత పది సంవత్సరాల నుంచి ఈ భవనం దెబ్బతింటూ వస్తోంది. ప్రస్తుతం ఈ భవనం పెచ్చులు ఊడిపోతూ శిథిలావస్థకు చేరుకుంటోంది. వర్షాలు పడే సమయంలో చాలా చోట్ల నీరు కారుతుండడం ఇబ్బందిగా మారింది.

పుస్తకాల భద్రత ప్రశ్నార్థం..

ప్రస్తుతం ఇక్కడ 26 వేల పుస్తకాలు ఉన్నాయి. ఇందులో 15 వేల వరకు వివిధ పోటీ పరీక్షలకు సంబంధించినవి కాక.. ప్రతిరోజు ఆరు తెలుగు పేపర్లు, మూడు ఇంగ్లీష్ పేపర్లు వస్తున్నాయి. కాగా ఇందులో ఇప్పటి వరకు నాలువేల పుస్తకాల వరకు పూర్తిగా పాడైపోయాయి. అయితే గత సంవత్సరం అప్పటి ప్రభుత్వం కొత్తగా వెయ్యి పుస్తకాలను మంజూరు చేసి అందించింది. ఇక్కడ పాఠకుల సంఖ్య బాగానే ఉంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం 60 మందికి పైనే పాఠకులు వస్తున్నారు. అలాగే ఏవైనా పుస్తకాలు ఇళ్లకు తీసుకెళ్లడానికి రూ. 100 డిపాజిట్ చెల్లించవలసి ఉంటుంది. అలా చెల్లించి చాలా మంది పుస్తకాలు తీసుకెళ్తుంటారు. ఇందులో మహిళలు ఎక్కువగా వచ్చి నవలలు తీసుకెళ్తున్నారు. అన్ని రకాలైన పుస్తకాలు అందుబాటులో ఉన్నప్పటికీ వీటిని భద్రపరచుకోవడానికి స్థలం లేకపోవడం పెద్ద సమస్యగా ఉంది. ఇలాగే కొనసాగితే కొంత కాలానికి పుస్తకాలు పూర్తిగా పాడైపోయే పరిస్థితి ఉంది.


పోటీ పరీక్షల పుస్తకాలు, నవలలు

విశాల భవన నిర్మాణం కలేనా?

ఇరుగ్గా, శిథిలమవుతున్న భవనం స్థానంలో విశాలమైన గ్రంథాలయ భవన నిర్మాణానికి అధికారులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సానుకూల స్పందన లభించింది. అయితే ప్రభుత్వం మాడంతో అది అలాగే ఉండిపోయింది. ఈ పరిస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం స్పందించి కొత్త భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని.. లేకపోతే కనీసం మరమ్మతులనైనా నిర్వహించాలని పాఠకులు కోరుతున్నారు.


ఇరుగ్గా ఉన్న పాఠకుల గది


పోటీ పరీక్షలకు చదువుకుంటున్న యువకులు

ఎక్కువ మందికి అవకాశం లేదు..



ఈ గ్రంథాలయంలో గదులు చాలా చిన్నవిగా ఉండడం పెద్ద సమస్యగా ఉంది. ప్రతి రోజు చాలా మంది పాఠకులు వస్తున్నప్పటికీ ఇరుగ్గా ఉన్న కారణంగా పుస్తక పఠనం వీలు కాక చాలా మంది వెనక్కి వెళ్లిపోతున్నారు. అందరికీ అవకాశం లేకపోవడం బాధాకరం.
– కంటుభక్త శ్రీనివాస్, పాఠకుడు, భీమిలి

చర్యలు తీసుకోవాలి



ఇక్కడ విలువైన పుస్తకాలు ఉన్నాయి. అవి పాడవకుండా చూడవలసిన అవసరం ఉంది. ఈ భవనం దెబ్బతింటుండడం వల్ల ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అధికారులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే గ్రంథాలయాన్ని అందరూ వినియోగించుకోగలరు.
– జరజాపు ప్రసాద్, భీమిలి

జాగ్రత్తలు తీసుకుంటున్నాం..



ఇక్కడ ప్రస్తుతం ఉన్న పుస్తకాలు, కొత్తగా వచ్చే పుస్తకాలు దెబ్బతినకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చాలా మంచి పుస్తకాలు అందుబాటులో ఉండడం వల్ల పాఠకులు ఎక్కువ మంది వస్తున్నారు. వారికి అవసరమై పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా చూస్తున్నాం.
– ఎస్.మహేష్, శాఖా గ్రంథాలయం అధికారి

చంద్రంపాలెంలో ఆక్రమణల తొలగింపు


చంద్రంపాలెంలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల పరి రక్షణలో రెవెన్యూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్న తరుణంలో ఎట్టకేలకు చంద్రంపాలెంలో ఆక్రమణలు తొలగించారు. మధురవాడలో సుమారు 18 సెంట్ల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమిలో ప్రహరీ, చెట్లు తొలగించినట్టు ఆర్ఐ ఎ.కిషోర్ తెలిపారు. గత కొంత కాలంగా ఓ టీడీపీ నాయకుడు, ఇతర నాయకుల సహకారంతో తన స్వాధీనంలో ఉంచుకున్నారు. ఇక్కడ కల్యాణ మండపం ప్రతిపాదన రావడంతో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు దీనిని స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఇక్కడ ఒక షెడ్ కూడా తొలగించాలని, మరో 3 సెంట్ల వరకు స్థలం స్వాధీనం చేసుకోవాల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెప్పారు.

గ్రంథాలయ వారోత్సవాల జయప్రదానికి పిలుపు

తగరపువలస: ఈ నెల 14 నుంచి 20 వరకు ఆనందపురం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు బ్రాంచ్ అధికారి బి.వి.ఎస్. అప్పారావు తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, 16న కవి సమ్మేళనం, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 17 గ్రంథాలయ రంగంలో ప్రముఖులను స్మరించుకోవడం, 18న ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కథలు చెప్పడం, రాయడం, మ్యూజికల్ చైర్ పోటీలు, 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, 20న ముగింపు సభలో మాస్ రీడింగ్, బహుమతి ప్రదానం ఉంటాయన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక ఆదాయం

తగరపువలస: ఈ ఏడాది రాగి (చోడి) కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4,290 ఉన్నట్టు జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం భీమిలి మండలం శింగనబంద, నారాయణరాజుపేట పంచాయితీలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. చిరు ధాన్యాల సాగును రైతులు పెంచాలన్నారు. భీమిలి ఏవో బి.శివకోమలి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఇంద్రావతి, వేగావతి రకాల రాగి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాగి విత్తనాలు వెదచల్లడం కంటే ఎకరాకు 2 నుంచి 3 కిలోల నారుపోసి 21 నుంచి 30 రోజులు ఉన్న నారును ఊడుపు చేయడం ద్వారా కనీసం 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది రమేష్, హరీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

పద్మనాభం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికను పక్కాగా రూపొందించాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు అభివృద్ధి ప్రణాళికల రూపకల్పణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలకు రూపకల్పన చేయాలని తెలిపారు. ఈవోఆర్డీ మీనా కుమారి, చిన్నాపురం పంచాయతీ కార్యదర్శి నర్సింహమూర్తి ఈ ప్రణాళికల రూపకల్పణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, మండల పరిషత్ ఏవో జయ ఉమ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామానికి చెందిన కర్రి ఆదిలక్ష్మి (58) విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాండ్రంగి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి ఈ నెల 6వ తేదీన ఉచిత గ్యాస్ పథకం కోసం ఈకేవైసీ చేసుకునేందుకు తన కుమారుడు సూరిబాబుతో కలిసి బైకుపై భోగాపురం వచ్చింది. భోగాపురంలోని శ్రీసాయి దుర్గా గ్యాస్ ఏజెన్సీలో ఈకేవైసీ చేయించుకుని తిరిగి కుమారుడుతో కలిసి పాండ్రంగి బయలు దేరారు. మార్గం మధ్యలో సవరవల్లి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో కుమారుడు సూరిబాబు అక్కడికక్కడే చనిపోయాడు. తల్లి ఆదిలక్ష్మి తీవ్ర గాయాల పాలైంది. హైవే సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్ర గాయాల పాలైన ఆదిలక్ష్మిని విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మంగళవారం ఆదిలక్ష్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ టీఎస్ఎన్ రాజు తెలిపారు.

కార్మిక నేతలకు ఘన నివాళి

తగరపువలస: చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా గుజ్జు రామునాయుడు కార్మికులకు అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర ఏఐటీయూసీ కార్యదర్శి పడాల రమణ అన్నారు. మంగళవారం రామునాయుడు 40వ వర్ధంతి సందర్భంగా గుడివాడలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. నాయకులు కానూరి రాంబాబు, చిల్ల రాంపైడి, మోర అప్పలరాజు, దాసరి అప్పలస్వామి, కొసన చంద్రయ్య, లక్ష్మణరావు, సన్నిబాబు, ముత్యాలు, నూలు ఆదినారాయణ, అల్లం గోవింద తదితరులు పాల్గొన్నారు.

రాజుబాబుకు నివాళులు..

సిటు సీనియర్ నాయకుడు బాకి రాజుబాబు మంగళవారం గణేష్ థియేటర్ వీధిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు సిటు నాయకులు ఎస్. అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు తదితరులు నివాళులు అర్పించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 22 మంది విద్యార్థుల ఎంపిక

తగరపువలస: అవంతి రీసెర్చి అండ్ టెక్నాలజీ అకాడమీలో మంగళవారం సవంతీస్ సొల్యూషన్ ఎల్ఎల్‌సీ హైరింగ్ ఫర్ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినందించారు. డ్రైవ్‌లో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్లు పి.గోవిందరావు, వీజేజే ప్రసాద్, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఏవో అశోక్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.భాస్కరరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో ఇసుక దొంగలు


ఇసుక తరలించడంతో ఏర్పడిన గొయ్యి

కొమ్మాది: మంగమారిపేట బీచ్ వద్ద తీరం కరిగిపోతుంది. రాత్రి సమయాల్లో ఇక్కడ గుర్తు తెలియని వ్యక్తులు భారీగా సముద్రపు ఇసుకను తరలించేస్తున్నారు. దీంతో తీర ప్రాంతం వద్ద పలు చోట్ల భారీస్థాయిలో గుంతలు ఏర్పడుతున్నాయి. ఉప్పాడ, మంగమారిపేట, తిమ్మాపురం బీచ్‌ల వద్ద సముద్రపు ఇసుకను అక్రమంగా తరలించడంతో భవిష్యత్‌లో పెను ప్రమాదం తప్పదని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల సముద్రం ముందు కొచ్చే ప్రమాదం ఉందన్నారు. గెడ్డ ఇసుకలో కలిపేందుకు ఇక్కడ నుంచి తరలిస్తున్నారని, దీని వల్ల నిర్మాణాలు నాణ్యత కోల్పోతాయని హెచ్చరించారు. ఇప్పటికే తీర ప్రాంతంలోని కొండలను తవ్వి గ్రావెల్, రాయి తరలిస్తున్నారని.. ఇప్పుడు ఇసుకను కూడా వదలడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుని తీరాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా కార్తీక ఏకాదశి పూజలు


చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో శివ లింగ ఆకృతిలో పూలతో అలంకరణ చేస్తున్న భక్తులు


శ్రీరమా సత్యనారాయణస్వామికి అర్చన చేస్తున్న వివేకానంద శర్మ


ఎండాడలో పూజలందుకున్న సీతారాములు

తగరపువలస: కార్తీకమాస శుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయం మంగళవారం భక్తులతో పోటెత్తింది. కొండపై కనకదుర్గ, గీతా మందిరం, శివాలయం, రాధాకృష్ణులు, సీతారాముడు, ఆంజనేయస్వామి, సత్యసాయి మందిరం, నవగ్రహ మండపం ఉన్నందున వేలాది మంది భక్తులు ఈ ఆలయాలను సందర్శించారు.

శివయ్యకు ప్రత్యేక పూజలు..

కొమ్మాది: ఎండాడలో గల శివాలయంలో శివయ్యకు, రామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్మాది అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయ ప్రాంగణంలో గల వైశాఖేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

మధురవాడ: మధురవాడ సిద్దేశ్వర స్వామి పీఠంలోని శ్రీ అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణుల ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష ఒత్తులతో దీపారాధన

చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ ఆవరణలో విశేష దీపారాధన చేశారు. శివ లింగం, శంఖు చక్రాల ఆకృతులను పూలు, రంగులతో సుందరంగా అలంకరించారు. మధురవాడ స్వతంత్ర నగర్‌కి చెందిన ఇల్లిపిల్లి దుర్గమ్మ కుటుంబ సభ్యులు సహాయ సహకారాలుతో లక్ష ఒత్తులతో వాటి చుట్టూ దీపాలు వెలిగించారు.


చందన అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు..

పీఎం పాలెం: పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరీ శంకరమఠంలోని శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం, కారుషెడ్ కూడలికి సమీపంలో గల శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయం, పీఎం పాలెం రామాలయం, ఆంజనేయ స్వామి కి ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాలకు భక్తుల తాకిడి..

పద్మనాభం: పద్మనాభంలోని గిరిపైన ఉన్న అనంతుని, దిగువున ఉన్న కుంతీ మాధవ స్వామి, గెద్దపేటలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త పూర్ణ చంద్రరావు పూజలు చేశారు.


శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

చందన అలంకరణలో శ్రీవారు

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీకొండ పైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద మంగళవారం కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీవారికి చందన అలంకరణ సేవను నిర్వహించగా, అర్చకులు అప్పలాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, సభ్యులు ముమ్మిడిశెట్టి సత్యానందరావు, కె.ముత్యాలరావు, పెదబాబు, సన్నిబాబు, మొకర శంకర్ పాల్గొన్నారు. అలాగే భీమిలి సమీపంలోని కీతినేపేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీవారికి చందన అలంకరణ చేసి అర్చకులు శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.తాతాజీ తదితరులు పాల్గొన్నారు. అయింది.